## క్లుప్తంగా

### లోక్ అదాలత్‌పై సమావేశం



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి చైతన్య

**అనపర్తి:** సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.చైతన్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి చైతన్య మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన అన్ని కేసులూ లోక్ అదాలత్‌లో పరిష్కారయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డుకు భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బందారు శివ

**బిక్కవోలు:** ఊలపల్లి గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యుడు బందారు శివ శుక్రవారంల భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వెలమపేటలోని లక్ష్మీ గణపతి ఆలయం వీధిలో పంచాయతీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు గొర్రిపోటి శ్రీను, సిద్దనాటి గోపి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### సర్వీసులకు ఆధార్ లింక్ తప్పనిసరి



మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీధర్ వర్మ

**సీతానగరం:** విద్యుత్ సర్వీసులకు ఆధార్ నంబర్ లింక్ తప్పనిసరి అని రాజమహేంద్రవరం రూరల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దొడ్ల శ్రీధర్ వర్మ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురంలోని చేయూత లబ్ధిదారులకు సంబంధించిన సర్వేలో పాల్గొన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ సంబంధిత అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైట్, బిల్ కలెక్టర్, రెవెన్యూ క్యాషియర్, గ్రామ సచివాలయాల వద్ద, స్పెషల్ డ్రైవ్ సమయంలోనూ సర్వీసులకు ఆధార్ నంబర్లు లింక్ చేసుకోవచ్చన్నారు. కొత్త మీటర్ల కోసం గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని, బిల్లులు ఆన్‌లైన్‌లోనే కట్టాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ చిట్టిరాజు, ఏఈ చంద్రమోహన్ పాల్గొన్నారు.

### ఫిట్ ఇండియాతో సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపల్లిలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

**గోకవరం:** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు అన్నారు. కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. యోగా సాధన చేస్తూ ఆరోగ్యం కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ఓ పి.శ్రావ్య, హెచ్‌వి అరుణోనమ్మ, హెల్త్ అసిస్టెంట్లు పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### సారా కేసులో వ్యక్తికి రిమాండ్

**రంగంపేట:** మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలోని శెట్టిబలిజపేటలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. గ్రామానికి చెందిన పితాని వీర వెంకట సత్యనారాయణ పది లీటర్ల సారా కలిగి ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు సారా సరఫరా చేస్తున్న ముకుందవరానికి చెందిన పత్తి ఏసుపై కేసు నమోదు చేశామన్నారు. పితాని వీర వెంకట సత్యనారాయణను పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిరుల తల్లికి ప్రణమిల్లి..



ఊలపల్లిలోని జి.మామిడాడ రోడ్డులో కొలువైన కనకదుర్గమ్మ



అనపర్తిలో మహాలక్ష్మి అమ్మవారు



శాకంబరిగా ఈలకొలను ముత్యాలమ్మ



గోకవరంలో వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

- ఇంటింటా శ్రావణ సందడి
- భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- కిటకిటలాడిన ఆలయాలు

**అనపర్తి:** శ్రావణ శుక్రవారం సందర్భంగా అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామాల్లో లోగిళ్లు శ్రావణ శోభతో సందడిగా మారాయి. మహిళలు వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవార పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శాంతిపురంలోని గణపతి, సరస్వతి సహిత మహాలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రాంబాబు శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పరిశీలించారు.

**రంగంపేట:** శ్రావణ శుక్రవారాన్ని పురష్కరించుకుని మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో కొలువైన ముత్యాలమ్మను కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం 4000 మందికి అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.



అనపర్తిలో అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

**బిక్కవోలు:** ఊలపల్లి గ్రామంలోని జి.మామిడాడ రోడ్డులో కొలువైన కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అలంకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొమరిపాలెం కనకదుర్గమ్మ, తొస్సిపూడి నవదుర్గ, పందలపాక కట్లమ్మ, బిక్కవోలు పార్వతీ దేవి తదితరుల ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

**సీతానగరం:** సింగవరం నాగరత్నం కాలనీ వద్దగల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సీతానగరంలోని వరలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ**

**గోకవరం:** స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారిని అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు.

## వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**రాజానగరం:** మండలంలోని కలవచర్లకు చెందిన 25 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను కలుసుకున్నారు. తమ అభీష్టాన్ని తెలపడంతో ఆయన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. లోకల్ కేడర్‌తో కలిసి, పార్టీని మరింతగా పటిష్ట పర్చడంతో పాటు రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు.

## ఆర్‌బీకేలతో రైతులకు భరోసా



వెంకటాపురంలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా భవనాల ప్రారంభోత్సవం

**రంగంపేట:** రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కొత్త వీరంపాలెం, వెంకటాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం అద్భుత కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి నుంచి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ఆర్‌బీకేలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు రైతులకు అవసరమైన సేవలన్నీ రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయం, ఉద్యానవన, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్య తదితర శాఖలకు చెందిన సేవలన్నీ ఈ ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తారన్నారు. గ్రామ సచివాలయాలతో పాలన ప్రజలకు చేరువైందని, ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 530 రకాల సేవలను గ్రామ సచివాలయాల్లో అందించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వెంకటాపురంలో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సచివాలయ భవనానికి, తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలు ద్వారంపూడి లక్ష్మీపతి, ముంగి సీతారత్నాన్ని సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మంగిన రాంబాబు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, సర్పంచ్‌లు మత్సా పద్మశ్రీ, ముంగి గంగరాజు, పీఆర్ జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు, ఏఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- ప్రతి ఇంటికీ పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

**రాజానగరం:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కలవచర్లలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పరంగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్ల ద్వారా వివరించారు.

**రూ. 5.34 కోట్లతో అభివృద్ధి పనులు**

కలవచర్లలో గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వపరంగా రూ.5.34 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద వాడికి నివాస స్థలాలు అందిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సోదరులు చేసిన విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ముందుగా గ్రామ సచివాలయంలో ఉద్యోగులతో సమావేశమై గ్రామంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. కాపు నేస్తం, చేయూత వంటి కొన్ని పథకాలు బ్యాంకు లింకేజ్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు దంతులూరి రఘువర్మ, దాట్ల రఘు, సుంకర శ్రీనివాస్, పెదకాపు, గంధం శ్రీను, పెదపాటి లొవరాజు, దుర్గారావు పాల్గొన్నారు.



కలవచర్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

## మారుమూల గ్రామాలకూ రైట్‌రైట్

- ఆర్టీసీ బస్సుల రాకపోకలు
- ప్రయాణికుల హర్షం

**మధురపూడి:** మారుమూల పల్లెలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించడంతో గ్రామీణ వాసుల ప్రయాణాలు సులభతరంగా, సురక్షితంగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ, గోకవరం మండలాల్లో పలు మారుమూల గ్రామాలున్నాయి. వీటిలో బుచ్చెంపేట, గుమ్ములూరు, మధురపూడి, నిడిగట్ల, గాదరాడ, కణుపూరు, గరగలంపాలెం అచ్చుతాపురం, గోపాలపురం, తిరుమలాయపాలెం, యర్రంపాలెం తదితర గ్రామాలు ఉన్నాయి. వీటికి కొంతకాలంగా బస్సు సర్వీసులు తిరగడం లేదు. ప్రజలందరూ ఆటోలపై ఆధారపడుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**ఎమ్మెల్యే రాజా చొరవతో..**

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇటీవల రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మారుమూల ప్రాంతాలకు బస్సులు తిరగక, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. ఆ నేపథ్యంలో గోకవరం ఆర్టీసీ డిపో అధికారులు మారుమూల గ్రామాలకు బస్సులను పునరుద్ధరించారు. ప్రస్తుతం గోకవరం – గోపాలపురం, గోకవరం – బుచ్చెంపేట, గోకవరం – మధురపూడి, గోకవరం – కలవచర్ల వయా గాదరాడకు బస్సులు తిరుగుతున్నాయి. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఉదయం 8.20, సాయంత్రం 5.20 గంటలకు బస్సులు తిప్పుతున్నారు. విమాన ప్రయాణికులు తక్కువ ఖర్చుతో రాజమహేంద్రవరం సురక్షితంగా చేరుతున్నారు. బుచ్చెంపేటకు బస్సు పునరుద్ధరణలో సచివాలయం కన్వీనర్ మద్దాల చంటిబాబు, ఎస్సీసెల్ కార్యదర్శి జొన్నకూటి నాని పాల్గొన్నారు.



మారుమూల గ్రామాలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు

## ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి

- విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- కమిషనర్ దినేష్ కుమార్

**మధురపూడి:** ఆరోగ్యకర సమాజం నిర్మాణానికి ఫార్మసీ విద్యార్థులు కృషి చేయాలని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని కేజేఆర్ ఫార్మసీ కాలేజీ 20వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్షణాలతో పాటు, సామాజిక బాధ్యతను గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. కేజేఆర్ ఫార్మసీ కాలేజీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ డానియేల్ రవీంద్ర సుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన 85 మందికి మెమెంటోలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చందన్ కుమార్ బ్రహ్మ, వైస్ ప్రిన్సిపల్ భానుసుధ, హెచ్ఓడీ డాక్టర్ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

### సారా స్వాధీనం

**రాజమహేంద్రవరం రూరల్:** కొంతమూరు సంతోష్ నగర్‌కు చెందిన పెద్దపల్లి చిన్నారిని అరెస్టు చేసి, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. నిందితుడిని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచామన్నారు.

## నేడు కోరుకొండకు సత్య రథం

**మధురపూడి:** అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి వారి సత్యరథం శనివారం కోరుకొండ వస్తోందని అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. అన్నవరంలో సత్యరథంలో బయలుదేరిన స్వామివారు శనివారం మధ్యాహ్నానికి ఇక్కడకు చేరుకుంటారు. స్వామివారికి భక్తులు స్థానిక కాపవరంలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కోరుకొండ మెయిన్ రోడ్డు, బస్టాండ్ సెంటర్ మీదుగా లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రథం చేరుకుంటుంది. భక్తుల దర్శనం అనంతరం పశ్చిమగానుగూడెం మీదుగా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామానికి వెళుతుంది. అక్కడి నుంచి ఏజెన్సీకి పయనమవుతుంది.

### నేడు ఎమ్మెల్యే రాజా పర్యటన

**సీతానగరం:** ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం మండలంలో పర్యటించనున్నారు. రఘుదేవపురం షిర్డీ సాయిబాబా ఆలయ దగ్గర జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మెగా వైద్యశిబిరంలో ఉదయం 11.15 గంటలకు పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మదర్ థెరిస్సా సెంటర్‌లో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా డాక్టర్‌బాబు మిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 1.30 గంటకు సీతానగరం జీవీకే ఫంక్షన్ హాల్లో మండలంలోని కొన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు రాపాకలో జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కాతేరు – సీతానగరం రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

### రేపు గుమ్మళ్లదొడ్డిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

**గోకవరం:** మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామగిరి కొండపై ఆదివారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శుక్రవారం తెలిపారు. అన్నవరం దేవస్థానం ధర్మప్రచార మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు ఈ వ్రతాలు నిర్వహిస్తారన్నారు. వ్రతంలో పాల్గొనే వారికి పూజా సామగ్రి, స్వామి వారి వెండి ప్రతిమ, అన్నవరం ప్రసాదం ఉచితంగా అందిస్తారన్నారు. వ్రతాలు ఆచరించే భక్తులు ముందుగా ఆలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

### 28న మండల సమావేశం

**బిక్కవోలు:** ఈనెల 28న మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షత వహిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

### జక్కంపూడి రాజాకు అభినందనలు

**రాజానగరం:** వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండో పర్యాయం నియమితులైన స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు మండలంలోని పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. గంగిశెట్టి సోమేశ్వరరావు, మందారపు వీర్రాజు, అనదాస సాయిరామ్, అడబాల చిన బాబు, గండి నానిబాబు, వేమగిరి కృష్ణ, కోలపాటి వెంకన్న తదితరులు ఎమ్మెల్యేను అభినందించిన వారిలో ఉన్నారు. రాజా ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందు వరుసలో నిలబెట్టడంతో పాటు జిల్లా అధ్యక్షుడిగా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో చురుకైన పాత్ర పోషించారంటూ కితాబిచ్చారు.

### క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

**ప్రకాశం నగర్:** చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గౌతమ ఘాట్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గం ఉత్తరకంచి గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్, పుట్‌బాల్, షటిల్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోడ శ్రీను, గుడాల వెంకట్రాజు, బక్కిన భాను, గుడాల సురేష్ పాల్గొన్నారు.

### సంహితలో క్యాంపస్ డ్రైవ్

**కంబాలచెరువు:** తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో శుక్రవారం దివీస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందని కళాశాల ప్రిన్సిపల్ టి.రామకృష్ణ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 115 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 60 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల ఏవో జి.బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ, ఉద్యోగాలు సాధిస్తూ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

### ఎంఈవో లజపతిరాయ్‌కి సత్కారం

**కడియం:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్న ఎంఈవో వి.లజపతిరాయ్‌ని శుక్రవారం స్థానిక చెల్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎంఆర్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. సమితి సభ్యులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

### పదోన్నతులు కల్పించాలి

**కంబాలచెరువు:** వైద్య, ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర సంఘం అధ్యక్షులు పి.రఘుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సర్వీసులో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2గా నియమితులై, ఒక్క పదోన్నతి కూడా పొందకుండానే అదే క్యాడర్‌లో ఉద్యోగ విరమణ చేస్తున్నారన్నారు. తమ క్యాడర్ కు గ్రేడ్ 1, ల్యాబ్ సూపర్ వైజర్లుగా పదోన్నతులుగా కల్పించాలన్నారు. కరోనా పరీక్షలు నిర్వహించడంలో మన రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామన్నారు.